

## క్షేత్ర స్థాయిలో సర్ ప్రక్రియను పరిశీలించిన సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,హుజురాబాద్ ఇంచార్జి ప్రణవ్

- బిఎల్ఏ విధిగా ఓటు సవరణ ప్రక్రియలో పాల్గొనాలి
- వావిలాల,సైదాబాద్ గ్రామాల్లో పర్యటించిన నేతలు

జమ్మికుంట జూలై 18 (వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్ ప్రక్రియలో పార్టీ నియమించిన బిఎల్ఏ,కో ఆర్డినేటర్లు విధిగా పాల్గొని నిరంతరం సమీక్ష జరపాలని కరీంనగర్ సుడా ఛైర్మెన్,హుజురాబాద్ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు. శనివారం రోజున జమ్మికుంట మండల పరిధిలోని వావిలాల,సైదాబాద్ గ్రామాల్లో సర్ కార్యక్రమంపై క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లతో ముచ్చటించారు. ఓటు నమోదు చేసుకునే క్రమంలో ఏదైనా సమస్యలు ఏర్పడుతున్నాయా అని ప్రశ్నించారు. ఏదైన సమస్య ఉత్పన్నం అయినప్పుడు సంబంధిత బిఎల్ఏ లేదా బిఎల్ఓ అధికారులకు తెలియజేసి పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. ఎన్నికల కమిషన్ పొడిగించిన సమయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఓటరును మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్,వైస్ చైర్మన్,మండల,పట్టణ అధ్యక్షులు,సర్ కో ఆర్డినేటర్లు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,గ్రామ శాఖ అధ్యక్షులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాక్రోజ్ జనతా పార్టీ ఉద్యమానికి టీఆర్పీ సంపూర్ణ మద్దతు

నీట్ బాధితులకు రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించాలి

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి

రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా




కరీంనగర్,జూలై 18(వాయిస్ టుడే):తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఢిల్లీలో కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా కరీంనగర్ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ కాక్రోజ్ జనతా పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన ఘోర వైఫల్యాలు, అవకతవకలు, నిర్లక్ష్యం కారణంగా దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని,అనేక కుటుంబాలు నష్టపోయాయని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన కేంద్ర ప్రభుత్వం దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.నీట్ వ్యవహారంలో నష్టపోయిన ప్రతి బాధిత విద్యార్థి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.అలాగే ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున గట్టిగా డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేయడం, పరీక్షల నిర్వహణలో బాధ్యతారాహిత్యం ప్రదర్శించడం క్షమించరాని నేరమని అన్నారు. విద్యను కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టి సామాన్య,మధ్యతరగతి కుటుంబాల పిల్లల జీవితాలను ప్రమాదంలోకి నెట్టే విధానాలను టీఆర్పీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.ప్రజల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు,సామాజిక న్యాయం కోసం జరిగే ప్రతి ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా నిలుస్తుందని,అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా,ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కార్యదర్శి దాట్ల శ్రీనివాస్,జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ దేవి,జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ వాజిద్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్,టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, మండలాల అధ్యక్షులు శివరాత్రి మోహన్,ఓర్సు రాజు,ఓర్సు విమల పార్టీ నాయకులు మహబూబ్ అలీ,కోరే గంగ,గుండోజు పద్మ, నేదునూరి రాజు,నేదునూరి కుమారస్వామి,గుండోజు సదానందం,దారంగుల గణేష్, మోహన్,మధు,ధర్మారపు అనిల్ పాల్గొన్నారు.

## నకిలీ డీఏపీ ఎరువులు తయారీ ముఠా గుట్టురట్టు

రూ. 1.50 కోట్ల విలువైన 1000 బస్తాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన హుజూర్ నగర్ సీఐ :జి.చరమందరాజు

హుజూర్‌నగర్, జూలై 18 (వాయిస్ టుడే ప్రతినిధి): పెద్ద అంబర్‌పేటలో నకిలీ డీఏపీ ఎరువుల తయారీ ముఠా గుట్టురట్టైందని, హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు తెలిపారు. శనివారం పోలీసులు నిర్వహించిన దాడిలో సుమారు రూ. 1 కోటి 50 లక్షల విలువైన 1000 నకిలీ డీఏపీ బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసుల రాకను గమనించిన నిందితులు పరారయ్యారు. సీఐ చరమంద రాజు తెలిపిన వివరాల ప్రకారం, హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన రైతు ఒకరు నకిలీ డీఏపీ కొనుగోలు చేసిన ఫిర్యాదు మేరకు మఠంపల్లి మండలంలో నమోదైన కేసును విచారించగా కీలక ఆధారాలు లభించాయి. వాటి ఆధారంగా పెద్ద అంబర్‌పేటలోని గోదాముపై మెరుపు దాడి చేశారు. తనిఖీల్లో హసాల్ట్, గ్రోమోర్, కోరమండల్, అన్నపూర్ణ తదితర ప్రముఖ కంపెనీల పేర్లతో ఉన్న ఖాళీ సంచుల్లో ఉప్పు, మట్టి వంటి నాసిరకం పదార్థాలను రసాయనాలతో కలిపి డీఏపీగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ప్రింటింగ్, స్టిచ్చింగ్ యంత్రాలతో అసలు ఎరువుల సంచుల మాదిరిగానే ప్యాకింగ్ చేసి రైతులను మోసం చేస్తున్నట్లు వెల్లడైంది.

మేళ్లచెరువు, బిజినేపల్లికి సరఫరా నకిలీ ఎరువులను డీసీఎం వాహనాల ద్వారా మేళ్లచెరువు, నాగర్‌కర్నూలు జిల్లా, బిజినేపల్లి తదితర ప్రాంతాలకు ఏజెంట్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఒక్కో బస్తాను సుమారు రూ. 1,500కు విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నకిలీ ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులకు అప్పగించామని, పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని సీఐ చరమంద రాజు పేర్కొన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, అనుమానాస్పద ఎరువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

### నకిలీ ఎరువుల గుట్టురట్టు.. హైదరాబాద్‌లో ఆకస్మిక దాడులు

హుజూర్ నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాల కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో భాగంగా హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం హైదరాబాద్‌లో ఆకస్మిక దాడులు నిర్వహించింది. హైదరాబాద్‌లోని పెద్ద అంబర్‌పేట్, హరితహారం కాలనీలో ఉన్న గోదాములు, తయారీ కేంద్రాలపై మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో నకిలీ ఎరువులు తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. దాడుల్లో గోదాముల్లో నిల్వ ఉంచిన అనుమానాస్పద ఎరువుల బస్తాలను పరిశీలించి, నమూనాలను సేకరించినట్లు తెలుస్తోంది. ఈ నకిలీ ఎరువుల తయారీ, సరఫరా వెనుక ఉన్న ముఠా, ప్రధాన సూత్రధారులు ఎవరు రాష్ట్రంలోని ఏయే ప్రాంతాలకు ఈ ఎరువులు సరఫరా అయ్యాయి అనే కోణాల్లో పోలీసులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. రఘునాథపాలెంలో ప్రారంభమైన ఈ దర్యాప్తు హైదరాబాద్ వరకు విస్తరించడం కలకలం రేపుతోంది. కేసులో మరికొంత మంది ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో త్వరలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.




## భారతదేశ సాంకేతిక చరిత్రలో సరికొత్త అధ్యాయం

ఆల్ఫోర్స్ పాఠశాలలో సంబరాలు

కరీంనగర్,జూలై 18(వాయిస్ టుడే): సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి వైపు పయనిస్తుందని ఆల్ఫోర్స్ పాఠశాల ప్రిన్సిపాల్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ కు చెందిన ప్రముఖ స్పేస్ స్టాప్ స్కై రూట్ ఏరోస్పేస్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన దేశపు మొట్టమొదటి ప్రవేట్ ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి నింగిలోకి దూసుకెళ్లి చరిత్ర సృష్టించిందని చెప్పారు.ఈ చారిత్రాత్మక ప్రయోగం విజయంతో కక్షలోకి పంపగల సత్తా ఉన్న ప్రపంచ దేశాల సరసన భారత్ చేరిందని హర్షం వ్యక్తం చేస్తారు. నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచినదని వారు కొనియాడారు. ఏడంతస్తుల ఎత్తుగా ఉన్న ఈ రాకెట్ ను సరికొత్త 3డి ప్రింటింగ్ టెక్నాలజీలతో పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపొందించడం జరిగిందని,కావున ప్రతి ఒక్కరూ సాంకేతికంగా పరిజ్ఞానం పట్ల పట్టు తెచ్చుకోవాలని మరియు నూతన ఆవిష్కరణలకు బీజం వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా ఆషాడ మాసం బోనాలు

కరీంనగర్,జూలై 18(వాయిస్ టుడే): శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆషాఢ మాసపు ముందస్తు బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో,సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకొని తలపై బోనం ఎత్తుకొని,విద్యార్థులు పోతు రాజుల వేష ధారణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ప్రదానాచార్యులు మోర రణధీర్ బోనాల పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ,గట్టు శ్రీనివాస్ మరియు ఆచార్యుల బృందం పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆలోచనా శక్తిని పెంపొందించే అద్భుత సాధనం చెస్

చెస్ పోటీల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

క్రీడాకారులకు ప్రోత్సాహం

నిర్వాహకులు డైరెక్టర్ అనుప్‌కు అభినందనలు



కరీంనగర్,జూలై 18(వాయిస్ టుడే):విద్యార్థుల మేధో వికాసం,ఏకాగ్రత మరియు నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నగరంలోనిర్వహించిన చెస్ పోటీల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ చదరంగం (చెస్) అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాకుండా విద్యార్థుల ఆలోచనా శక్తిని, విశ్లేషణాత్మక దృష్టిని,ఓర్పును పెంపొందించే అద్భుతమైన మేధో క్రీడ అని పేర్కొన్నారు.విద్యార్థులను ప్రోత్సహించేందుకు డైరెక్టర్ అనుప్ ప్రతిష్టాత్మకంగా ఈ చెస్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.చెస్ ఆటవిద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచడమే కాకుండా క్లిష్ట పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. జీవితంలోనూ,విద్యలోనూ విజయాలు సాధించేందుకు చెస్ వంటి మేధో క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రాబోయే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొంటూ,భవిష్యత్తులో కరీంనగర్‌కు చెందిన యువ క్రీడాకారులు కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి,రాష్ట్రానికి,నగరానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని,వాటిని సమానంగా స్వీకరించి మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.క్రమశిక్షణ,అంకితభావం, నిరంతర సాధనతో ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని అన్నారు. ఈ బృహత్తర చెస్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన డైరెక్టర్ అనుప్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ,పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు,కార్పొరేటర్ కె ఏపీపీ చంద్ర, క్రీడా సంఘాల అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్,కనకయ్య పాల్గొన్నారు.



## ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్,జూలై 18(వాయిస్ టుడే): నగరంలోని 10వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సౌగాని కొమరయ్య ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్‌వారి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని,ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు,స్థానిక కార్పొరేటర్ సౌగాని కొమరయ్య,అపోలో హాస్పిటల్ వైద్యులు,వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు,డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



## కార్పొరేషన్‌లో సిటీ బస్సులు నడపాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం

కరీంనగర్,జూలై 18(వాయిస్ టుడే): కార్పొరేషన్ పరిధిలో ప్రజా రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు గాను హైదరాబాద్ సెక్రటేరియట్‌లో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నగరం దినదినాభివృద్ధి చెందుతుందని,ప్రస్తుతం 6 లక్షల జనాభాఅకలిగిన కార్పొరేషన్ పరిధిలో 3 వైద్య కళాశాలలు,ఒక శాతవాహన విశ్వవిద్యాలయం ఉన్నాయని,ఇటీవల 14 గ్రామాలు విలీనం అయ్యాయని,విద్యార్థులు, రోగులు,ఉద్యోగులు మరియు సామాన్య ప్రజలు ప్రభుత్వ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ప్రైవేట్ వాహనాలపై ఆధారపడటం వల్ల ఆర్థిక భారం పడుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సాయిని తిరుపతి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కామిరెడ్డి రామ్ రెడ్డి, పెంట శేఖర్ పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి

### జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్




కరీంనగర్,జూలై 18(వాయిస్ టుడే): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల జూలై 29,30 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా జిల్లా కార్యాలయం (మంకమ్మతోట)లో రాష్ట్ర కమిటీ సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సమావేశాలకు ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య, జాతీయ ఉపాధ్యక్షురాలు ఆయుష్ ఘోష్ హాజరవుతున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను ఈ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రూపొందించనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో అందక వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత,ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని,ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు.అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాల్సిందిగా విద్యా ర్థులను, మేధావులను కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కంపెల్లి అరవింద్,జిల్లా ఉపాధ్యక్షులు ఇసాక్,సహాయ కార్యదర్శులు బోగేష్,గట్టు ఆకాశ్, జిల్లా కమిటీ సభ్యులు రోహిత్, సందేశ్, రక్షక్, నరేష్,నాయకులు సాయి, చందు,వరుణ్,అజయ్ పాల్గొన్నారు.